కథల ప్రపంచం - 2

అతిలోక సుందరి

బొమ్మలు : ఎం. మిన్జ్

ఎస్టోనియన్
జానపద కథ



అనగనగా ఒక రైతుకి ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకులు ఇద్దరూ ఆరోగ్యంగా, బలంగా ఉంటే, మూడవవాడు మాత్రం బక్కగా, పీలగా ఉండేవాడు. అన్నలిద్దరూ తమ్ముడిని చూడటానికి కూడా ఇష్టపడేవారు కాదు. అతడిని 'పిచ్చోడు' అనేవారు.

తండ్రి ముసలివాడు అయిపోయాడు. తండ్రి చనిపోయిన తరవాత ఆస్తినంతటినీ తామే చేజిక్కించుకోవాలని అన్నలు అనుకోసాగారు. తండ్రి మాత్రం ముగ్గురినీ సమానంగా ప్రేమించేవాడు. ఒక రోజు అతను ముగ్గురు కొడుకులను పిలిచి ఇలా చెప్పాడు: "నేను చనిపోయిన తరవాత మీరు కొట్టుకోకుండా ఉండటానికి ఆస్తిని నేను బతికి ఉండగానే పంచుదాం అనుకుంటున్నాను."

అన్నలిద్దరూ సంతోషంతో తలలూపారు. తండ్రి ఇలా చెప్పాడు: "మీరు వెళ్లి లోకమంతా తిరగండి. సంవత్సరం తరవాత మేలిమి జలతారు వంటి చొక్కా తెచ్చినవాళ్లకి ఈ ఇల్లు చెందుతుంది."

"సరే,"నని కొడుకులు బయలుదేరి వెళ్లారు. పెద్దవాళ్లు ఇద్దరు పట్టణందారి పట్టారు. అందరికంటే చిన్నవాడికి ఎక్కడికి వెళ్లాలో తెలియలేదు. అతడు ఎప్పుడూ పశువులను కాసుకుంటూ వెళ్లేదారిలో వెళ్లాడు. ఆ దారి అడవిని చేరింది. అడవిలో దారి కాలిబాటగా మారింది. 'ఈ దారి ఎక్కడికి తీసికెళుతుందో చూద్దాం,' అనుకున్నాడు చిన్నవాడు. చివరికి ఆ బాట ఒక అందమైన భవనాన్ని చేరుకుంది. భవనం చుట్టూ పొదలూ, చెట్లూ పిచ్చిగా పెరిగి ఉన్నాయి. అక్కడ అంతా స్మశానం మాదిరి నిశ్శబ్దంగా ఉంది.

చిన్నవాడు తలుపు దగ్గరకు వెళ్లి దాని మీద కొట్టాడు. తలుపు తెరుచుకోవటంతో లోపలికి వెళ్లాడు. లోపల ఎవ్వరూ లేరు. కానీ అంతా ఎవరో ఉన్నట్టే ఉంది.



ఒక గదిలో విందుకి సిద్ధం చేసినట్టు బల్లమీద అనేక రకాల ఆహార పదార్థాలు, పానీయాలు ఉన్నాయి. చాలా దూరం నడిచివచ్చిన చిన్నవాడికి చాలా ఆకలిగా ఉంది. దాంతో ఎక్కువ ఆలోచించకుండా కావలసినవన్నీ తనివితీరా తిన్నాడు. ఆ తరవాత ఒక్కటొక్కటిగా అన్ని గదులనూ వెదకసాగాడు. ఆ భవనంలో ఎన్నో గదులున్నాయి. ఎన్ని గదులు దాటాడో లెక్కించలేకపోయాడు.

అలా గదులు చూస్తుండగా ఒక గదిలోంచి చిన్నవాడికి ఏదో శబ్దం వినిపించింది. 'చివరికి మనుషుల జాడ దొరికింది. ఏది ఏమైనా లోపల ఎవరున్నారో తెలుసు కుంటాను,' అనుకున్నాడు చిన్నవాడు.

అతడు తలుపు తెరిచి గదిలోపలికి వెళ్లాడు.

ఆ గదిలోని ఒక కుర్చీలో ఉన్న ఒక పెద్ద రాగిరంగు పాముని చూసి భయంతో

అతడి కాళ్లు వణకసాగాయి. అతడు గదిలోంచి పారిపో బోతుండగా పాము అతడితో మాట్లాడసాగింది:

"భయపడకు యువకుడా! వెళ్లిపోవద్దు. నేను నీకు ఏ హానీ చెయ్యను."

చిన్నవాడు చిగురుటాకులాగా కంపించిపోసాగాడు. కానీ పాము కోరినట్లుగా గదిలోనే ఉండి పోయాడు.

అప్పుడు పాము, "దేని కోసం వెదుకుతున్నావు? ఇక్కడికి ఎలా వచ్చావు?" అని అడిగింది.

చిన్నవాడు తన కథంతా చెప్పుకొచ్చాడు. అతడు చెప్పింది శ్రద్ధగా విన్న పాము ఇలా అంది: "నీకు కావలసిన జలతారు చొక్కా నేనిస్తాను. అయితే నువ్వు సంవత్సరంపాటు నాకు సేవ చెయ్యాలి. రోజూ నీకు కావలసినంత తిని, తాగవచ్చు. రోజుకొకసారి నాకు స్నానం చేయించి ఈ కుర్చీలో నిద్రపుచ్చుటం నీ పని."

"జలతారులాంటి చొక్కా దొరికితే ఎక్కడ ఉన్నా ఒకటే. నీ షరతులు ఒప్పుకొని ఇక్కడే ఉంటాను," అన్నాడు చిన్నవాడు.



చిన్నవాడు తనకి కావలసినంత తిని, తాగేవాడు. రోజూ శ్రద్ధగా పాముకి స్నానం చేయించి, కుర్చీలో నిద్రపుచ్చేవాడు. ఇంటిదగ్గర కుక్క పిల్లలకి, గుర్రపు పిల్లలకి అలవాటు పడినట్లే ఈ పాముకి కూడా చిన్నవాడు అలవాటుపడి పోయాడు. ఆ విధంగా ఒక సంవత్సరం గడిచింది.

అప్పుడు చిన్నవాడు పాముతో, “నువ్వు చెప్పినట్లే ఒక సంవత్సరంపాటు నీకు సేవ చేశాను. నువ్వు అనుమతిస్తే మా నాన్న దగ్గరికి వెళతాను,” అన్నాడు.

“అలాగే వెళ్లు. నీకు ఇస్తానన్న జలతారు చొక్కా చిన్నగదిలోని అలమరలో ఉంది. దానిని తీసుకెళ్లు,” పాము చెప్పింది.

పాముకి ధన్యవాదాలు తెలిపి, జలతారు చొక్కా తీసుకుని ఇంటికి బయలుదేరాడు చిన్నవాడు.

అతడు ఇంటికి వెళ్లేసరికి అన్నలిద్దరూ వచ్చేసి ఉన్నారు. వాళ్లిద్దరూ అందమైన చొక్కాలు తెచ్చారు. చిన్నవాడు తాను తెచ్చిన చొక్కా బయటికి తీశాడు. అది చూసి అన్నలిద్దరూ ఆందోళన చెందారు. అంతటి పలచని, చక్కని చొక్కాని అంతకుముందు వాళ్లెవరూ చూడలేదు.

“చిన్నవాడే అందరిలోకి అందమైన చొక్కా తెచ్చాడు. వారసత్వంగా అతడికే నా ఇల్లు చెందుతుంది,” అన్నాడు తండ్రి.

“లేదు, లేదు!” అన్నలిద్దరూ అరిచారు, “మాకు ఇంకొక అవకాశం ఇవ్వు.”

"సరే," అంటూ ఒప్పుకున్నాడు తండ్రి, "సంవత్సరం ముగిసేనాటికి రుచికరమైన రొట్టె తెచ్చినవాడు నా వారసుడవుతాడు. సరేనా?"

"సరే," అన్నారు కొడుకులు. అన్నలిద్దరూ పట్టణం వైపుకి వెళితే చిన్నవాడు మళ్లీ అడవికి వెళ్లాడు. మునుపటి బాటవెంట నడిచి చెట్ల మధ్య ఉన్న భవనాన్ని చేరుకున్నాడు. ఇంటిలోకి ప్రవేశించి నేరుగా పాముని చూడటానికి వెళ్లాడు. ఇప్పుడు పాము వెండి రంగులో మునుపటికన్నా అందంగా ఉంది.

చిన్నవాడు పామును పలకరించి తాను వచ్చిన పని చెప్పాడు.

"ఒక సంవత్సరం పాటు నాకు సేవ చేస్తే నీకు కావలసిన రుచికరమైన రొట్టె దొరుకుతుంది. నీ పని తేలికే: రోజుకి రెండు సార్లు స్నానం చేయించి ఈ కుర్చీలో నిద్రపుచ్చాలి," అంది పాము.

చిన్నవాడు రోజూ తనకి కావలసినంత తిని, తాగేవాడు. ఎంతో ప్రేమతో తనకిచ్చిన పని చేసేవాడు. ఆ విధంగా ఒక సంవత్సరం గడిచిపోయింది.

"నీ సేవలో సంవత్సరం పూర్తి చేశాను. నువ్వు అనుమతిస్తే మా నాన్న దగ్గరికి వెళతాను," అన్నాడు.

"అలాగే వెళ్లు. నువ్వు ప్రేమతో నాకు సేవ చేశావు. చిన్నగదిలోని అలమరలో రొట్టె ఉంది తీసుకెళ్లు. అటువంటి రొట్టె నీకు ప్రపంచంలో మరెక్కడా దొరకదు," అంది పాము.

పాముకి ధన్యవాదాలు తెలిపి, అలమరలోంచి రొట్టె తీసుకుని ఇంటికి పయనమయ్యాడు చిన్నవాడు.

ముగ్గురు కొడుకులు తెచ్చిన రొట్టెను తండ్రి రుచి చూశాడు. చిన్నవాడు తెచ్చిన రొట్టె అన్నిటిలోకి ఎంతో రుచిగా ఉంది. "మన ఒప్పందం ప్రకారం చిన్నవాడే నా ఇంటికి వారసుడు!" అన్నాడు తండ్రి.

"లేదు, లేదు!" అన్నారు అన్నలిద్దరూ, "ముచ్చటగా మూడవ అవకాశం ఇవ్వు. ఈసారి గెలిచిన వాడు ఇంటి యజమాని అవుతాడు."

"మీరు చెప్పినట్లే కానివ్వండి," అంగీకరించాడు తండ్రి. "అందరిలోకి అందమైన కోడలిని తెచ్చినవాడు నా వారసుడవుతాడు. ఇల్లు, దాంట్లోని సమస్త సంపద అతడికే చెందుతాయి. సమ్మతమేనా?"

"సమ్మతమే!" అన్నారు కొడుకులు.

'ఇటువంటి మూర్ఖుడిని భర్తగా ఏ అందమైన అమ్మాయి అంగీకరించదు,' అన్న ధీమాతో అన్నలిద్దరూ ఉన్నారు.

పెద్దవాళ్లిద్దరూ పట్టణం దారిపడితే చిన్నవాడు అడవికి వెళ్లాడు. పాము ఇంటికి చేరుకుని లోపలికి వెళ్లాడు. ఈసారి పాము బంగారు రంగులో మెరిసిపోతోంది! చిన్నవాడు పాముని పలకరించి తన సమస్యను చెప్పుకున్నాడు:

"ఈ పోటీలో అన్నలతో నేను గెలవలేను."

"ఇంకొక్క సంవత్సరం నాకు సేవ చేస్తే ఈసారీ నువ్వే గెలుస్తావు. ఇక్కడ రుచికరమైన ఆహారం దొరుకుతుందని నీకు తెలుసు. పని అంత కష్టమైనది కాదు. రోజుకి మూడు సార్లు స్నానం చేయించి ఈ కుర్చీలో నిద్రపుచ్చాలి," అంది పాము.

"సంతోషంగా నీకు సేవ చేస్తాను," అన్నాడు చిన్నవాడు.



అలాగే రోజూ మూడుసార్లు పాముకి స్నానం చేయించి, నిద్రపుచ్చేవాడు. తన మాటను పాము ఎలా నిలబెట్టుకుంటుందన్న అనుమానం అతడికి లేకపోలేదు.

ఆ విధంగా ఒక సంవత్సరం పూర్తి అయ్యింది. ఇంటికి తిరిగి వెళ్లటానికి అనుమతి ఇవ్వమని చిన్నవాడు అడిగాడు. తన ప్రతిఫలం గురించి కూడా పాముకి గుర్తు చేశాడు.

"అలాగే వెళ్లు. మన ఒప్పందం ప్రకారం నీకు ప్రతిఫలం కూడా అందుతుంది. నువ్వు ఏం చెయ్యాలో జాగ్రత్తగా విను. ముందు వంటింటిలో పొయ్యి వెలిగించి కణకణ మండేట్లు చెయ్యి. తరవాత నన్ను తీసుకుని ఆ మంటల్లో పడెయ్యి. నేను తప్పించుకోటానికి వీలు లేకుండా తలుపు మూసెయ్యి. ఎంతగా బతిమాలినా, బెదిరించినా నన్ను బయటికి రానివ్వగూడదు సుమా!"

పాము చెప్పినట్లే చిన్నవాడు చేశాడు. కానీ తలుపు వేశాడో లేదో లోపలున్న పాము దానిని దబదబా బాదసాగింది. పెద్ద గొంతుతో భయంగొలిపేలా అరవసాగింది. ఎంతగా భయపెట్టినా, బతిమాలినా చిన్నవాడు మాత్రం తలుపు తియ్యలేదు.

చాలాసేపు పాము అరిచింది, కానీ చివరికి చల్లబడింది. చిన్నవాడు మరికొన్ని గంటలపాటు వేచి ఉండి అప్పుడు తలుపు తెరిచాడు.

పొయ్యి ఖాళీగా ఉంది. దాంట్లో బొగ్గులు కానీ, కనీసం రవ్వంత బూడిద కానీ లేవు!

"ఇదేదో మాయలాగా ఉందే!" అనుకుంటూ చిన్నవాడు పాము ఆనవాళ్లయినా దొరుకుతాయేమోనని భవనం అంతా వెదకసాగాడు.

అలా ఒక గది తరవాత ఒక గది చూస్తూ వెళుతున్నాడు. చివరికి ఒక గదిని చేరుకున్నాడు. ఆ గది మసక చీకటిగా ఉంది. గదిలో ఒక వైపున పట్టు పరదాలు ఉన్నాయి. దగ్గరికి వెళ్లి, పరదా తొలగించి చూసిన చిన్నవాడికి పట్టెమంచం మీదనుంచి లేచి వస్తున్న అతిలోక సుందరి కనిపించింది. ఆ అమ్మాయి ఇలా చెప్పింది:

"ఎంతో ప్రేమతో నాకు సేవ చేసినందుకు వేనవేల ధన్యవాదాలు, యువకుడా! ఒక క్రూర మాంత్రికుడు తన కొడుకుని పెళ్లి చేసుకోనందుకు నన్ను ఇలా పాముగా మార్చాడు. తెలియని యువకుడు ఎవరైనా మూడు సంవత్సరాలపాటు, నా కోరికలన్నీ తీరుస్తూ సేవ చేస్తే ఒక సంవత్సరం రాగిపాము, ఒక సంవత్సరం వెండి పాము, ఒక సంవత్సరం బంగారు పాముగా మారి శాప విముక్తమవుతుంది.



"నువ్వు నన్ను కాపాడావు. నీకు ఇష్టమైతే నన్ను పెళ్లి చేసుకుని మీ నాన్న దగ్గరికి తీసికెళ్లు."

ఆ యువకుడి ఆనందానికి హద్దుల్లేవు. భవనం నుంచి వాళ్లు బయటకు వచ్చారు. అంతా మారిపోయి ఉంది: పిచ్చిగా పెరిగిన చెట్లు, పొదల స్థానంలో చక్కటి పూలమొక్కలున్నాయి. అడవికి బదులు కనుచూపుమేర పంటపొలాలు ఉన్నాయి. ఒక అందమైన రథానికి గుర్రాలు పూన్చి ఉన్నాయి.

వాళ్లిద్దరూ అందులో కూర్చుని చిన్నవాడి ఇంటికి బయలుదేరారు. అంత అందమైన అమ్మాయిని చూసి అన్నలిద్దరూ, తండ్రి కూడా చూపులు మరల్చుకోలేక

పోయారు. చిన్నవాడి భార్యతో పోలిస్తే అన్నల భార్యలు చంద్రుని ముందు తారల్లా వెలతెలపోయారు.

"అందరికంటే చిన్నవాడే నా వారసుడు," తండ్రి ప్రకటించాడు. ఏమనటానికి అన్నలిద్దరికీ అవకాశం లేకపోయింది.

"నాకు ఈ ఇల్లు వద్దు. అన్నలిద్దరినీ దానిని పంచుకోమనండి. నా భార్యకు అనంత సంపదలు ఉన్నాయి," అన్నాడు చిన్నవాడు.

తన భార్య ఇంటినుంచి తండ్రికి, అన్నలకి విలువైన కానుకలు ఇచ్చాడు. ఆ తరవాత చిన్నవాడు, అతని భార్య చిరకాలం ఆనందంగా జీవించారు.

పిల్లి, కుక్క పులిగా మారిన ఎలుక

బొమ్మలు : నటాలియా సుస్తోవా

భారతీయ జానపద కథ



పులి శరీరంలో ఎలుక గుండె కొట్టుకుంటూ ఉంటే అది పిల్లికి దూరంగా ఉండటం మంచిదని నానుడి.

అనగా అనగా ఒక కాకి అడవి మీద ఎగురుతుండగా దాని నోటిలోని ఎలుక జారిపోయి కింద పడింది. ఆ అడవిలో మహిమలు ఉన్న ఒక ముని ఉన్నాడు. ఎలుక సరిగ్గా ఆ మనిషి కాళ్లదగ్గర పడింది.

మనిషి ఎలుకను తనతోపాటు ఇంటికి తీసుకెళ్లాడు. ఆ ఎలుకకి ఆహారం వేస్తూ ఉండటంతో అది సంతోషంగా ఉంది. ఒక రోజు ఎలుక బయటకు వెళ్లింది. దానికి బయట ఒక పిల్లి కనపడింది. ఎలుక తిరిగి ఇంటిలోకి పరుగు పెట్టింది.

ఒక మూలన నక్కి గజగజా వణికిపోతోంది.

అది చూసి మనిషి, "ఏమయ్యింది? ఎందుకు వణికిపోతున్నావు?" అని అడిగాడు.

"ఇంటి బయట ఒక పిల్లి కనపడింది, అయ్యా!" కీచుమంటూ చెప్పింది ఎలుక, "దానిని చూసి చచ్చేటంత భయం వేసింది."

"పిల్లులంటే నీకు భయం లేకుండా చేస్తాను," అన్నాడు మనిషి. "నువ్వు నిద్రపోయి లేచేసరికి పిల్లిగా మారిపోతావు."

మరునాడు మనిషి చెప్పినట్లే జరిగింది. ఒకప్పుడు ఎలుకగా ఉన్న పిల్లి సంతోషంగా ఇంటి బయటికి పరిగెత్తింది. నులివెచ్చని ఎండలో పడుకుందామని అనుకుంటుండగా దానికి పిల్లి మళ్లీ కనపడింది. తాను ఇప్పుడు ఎలుకని కాననీ, పిల్లినని మరిచిపోయి భయపడి అది ఇంట్లోకి పరిగెత్తింది.

"ఈసారి నిన్ను ఎవరు భయపెట్టారు?" దానిని చూసి అడిగాడు మనిషి.

పిల్లిని చూసి మళ్లీ భయపడ్డానని చెప్పటానికి సిగ్గనిపించి మనిషితో అబద్ధం చెప్పింది ఎలుక: "అడవిలో ఒక కుక్క నా వెంట పడింది. ఎలాగో తప్పించుకుని ఇంటికి చేరాను!"

"కుక్కలంటే నీకు భయం లేకుండా చేస్తాను," అన్నాడు మనిషి. "నువ్వు నిద్రపోయి లేచేసరికి కుక్కగా మారిపోతావు."

మరునాడు నిజంగానే అది పెద్ద కుక్కగా మారిపోయింది. పెద్దగా మొరుగుతూ అడవిలోకి పరిగెత్తింది. చెట్టు దగ్గర దానికి మళ్లీ పిల్లి కనపడింది. పిల్లి కూడా



కుక్కను చూసింది. కుక్క తనమీదకి దూకుతోందనిపించి రక్షణగా పిల్లి వళ్లు వంచుకుని, పంజాఎత్తి, పెద్దగా మ్యావ్‌మంది. దాంతో కుక్క భయపడిపోయి ఇంట్లోకి పరిగెత్తింది.

"ఈసారి నిన్ను ఎవరు భయపెట్టారు?" అడిగాడు మనిషి.

పిల్లిని చూసి భయపడ్డానని చెప్పటానికి కుక్కకి సిగ్గనిపించి మనిషితో అబద్ధం చెప్పింది: "ఏం చెప్పను అయ్యా! మన ఇంటి బయట ఒక పులి కనపడింది. దాని పంజానుంచి ఎలా తప్పించుకున్నానో నాకే తెలియటం లేదు!"

"పులి అంటే నీకు భయం లేకుండా చేస్తాను," అన్నాడు మనిషి. "నువ్వు నిద్రపోయి లేచేసరికి పులిగా మారిపోతావు!"

మరునాడు నిద్ర లేచేసరికి కుక్క కాస్తా పులిగా మారిపోయింది.

'నేను పులిని, అడవికి రాజుని,' అనుకుంది అది, 'నన్ను చూసి అడవిలో జంతువులన్నీ భయంతో గజగజలాడిపోతాయి!'

ఇలాంటి గొప్ప ఆలోచనలతో అది అడవిలోకి బయలుదేరింది. ఉన్నట్టుండి దానికి పిల్లి కనపడింది. పిల్లికూడా పులిని చూసింది. 'నా పని అయిపోయింది. పులినుంచి తప్పించుకోలేను,' అనుకుంది పిల్లి. దాని వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి, కళ్లు నిప్పులు కక్కాయి.

బయటికి పులేగాని దాని లోపల ఎలుక గుండె కొట్టుకోవటంతో పిల్లిని చూడగానే భయంతో ఇంట్లోకి పరిగెత్తింది పులి. అది ఒక చీకటి మూల నక్కింది. భయంతో దాని పళ్లు కొట్టుకుంటున్నాయి.

దానిని చూసి మనిషి ఆశ్చర్యపోయాడు. "ఇంకా దేనికి భయపడుతున్నావు? అడవిలో పులికంటే బలమైన జంతువు ఉందా?"

"ఉంది...." సగం ప్రాణం పోయిన పులి చెప్పింది.

"ఏమిటది?" మనిషి కుతూహలంగా అడిగాడు.

"అదీ... అదీ... అది పిల్లి!"

మనిషికి అంతా అర్థమయ్యింది. "పులి శరీరంలో ఎలుక గుండె కొట్టుకుంటూ ఉంటే అది పిల్లిని చూసినా భయపడుతుంది. కాబట్టి ఎలుక గుండె ఉన్నవాళ్లు ఎలుకగానే ఉండాలి," అన్నాడు మనిషి.

ఆ మాటలతో పులికాస్తా మునుపటి ఎలుకగా మారిపోయింది.





The Beautiful Bride, an Estonian Folk Tale, illustrated by M. Mintz, published by Minsk Yunatsva Publishers, 1989.

About a Little Mouse That was a Cat, a Dog, and a Tiger, an Indian Folk Tale, illustrated by N. Sustova, published by Minsk Yunatsva Publishers, 1985.

ఎస్టోనియన్ జానపద కథ

అతిలోకసుందరి

బొమ్మలు : ఎం. మిన్జ్

భారతీయ జానపద కథ

పిల్లి, కుక్క, పులిగా మారిన ఎలుక

బొమ్మలు : నటాలియా సుస్తోవా

భారతదేశ మొదటి ముద్రణ : మంచి పుస్తకం

ప్రచురణ కాలం : డిసెంబరు 2011

ISBN : 978-93-80153-64-3

ప్రతులు : 3000

వెల : రూ. 30/-

ప్రచురణ, ప్రతులకు :

మంచి పుస్తకం

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు - 500 017

ఫోన్ : 94907 46614.

email : info@manchipustakam.in

website : www.manchipustakam.in

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్,

హైదరాబాదు - 500 020

ఫోన్ : 040 - 2767 8411

మంచి పుస్తకం

ISBN 978-93-80153-64-3